క్లుప్తంగా

ఒకే రకం విత్తనాలకు అలవాటు పడొద్దు

ఆదోని రూరల్ : రైతులు ఒకే రకం విత్తనాలకు అలవాటు పడొద్దని, ప్రభుత్వం గుర్తించిన బ్రాండెడ్ కంపెనీల విత్తనాలనే వాడాలని ఆదోని మండల నూతన వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని, మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో రైతులు కోరుకున్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో ఎక్కువగా పత్తి సాగు అవుతుందని చెప్పారు. అలాగే ఇతర ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. రైతులు ఒకే రకానికి చెందిన విత్తనాలను కోరుతుండటం వల్ల ఆ విత్తనాలు బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయన్నారు.

ట్రాన్స్‌జెండర్ల మధ్య వివాదం



పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్స్ పట్టణాధ్యక్షురాలు మల్లిక

ఆదోని అర్బన్ : ఆదోని పట్టణంలో బండిమెట్ట వీధిలో ఉలిగమ్మ దేవరలో సోమవారం ట్రాన్స్‌జెండర్ల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ మేరకు గురువారం పట్టణంలోని ట్రాన్స్‌జెండర్లు స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ట్రాన్స్‌జెండర్స్ పట్టణాధ్యక్షురాలు మల్లిక విలేకరులతో మాట్లాడుతూ.. సోమవారం బండిమెట్టలో ఉలిగమ్మ దేవర చేశామని, ఊరేగింపులో డ్యాన్స్ చేసుకుంటూ ఘనంగా ఘనంగా జరుపుకున్నామన్నారు. అయితే దేవరలో కైరుప్పల క్రిష్ణవేణి, స్థానిక కొండగేరి మాధురి ఇద్దరూ బాగా మద్యం సేవించి పట్టణానికి చెందిన జుబేదా, లక్ష్మి, హారతిలను తీవ్రంగా కొట్టారని చెప్పారు. డ్యాన్స్ చేసుకుంటూ ఒకరినొకరు తగలడంతో వివాదం జరిగిందన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ. 45వేలు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం తిరుపతి వాస్తవ్యులు మహేశ్వరి, మల్లికార్జున దంపతులు రూ.45,000 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. ఈ మేరకు నగదును దేవాలయ కార్యాలయంలో అందజేశారన్నారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల కేంద్రం చుట్టూ తిరగకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించడం హర్షించదగ్గ విషయమని గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లప్ప అన్నారు. మండల కేంద్రంలోని చిన్నతుంబళం గ్రామంలో వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ మాట్లాడుతూ మండలానికి జీలుగ, వేరుశనగ, పిల్లిపెసర సబ్సిడీ విత్తనాలు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ విత్తనాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష



దోషుల్ని జైలుకు తరలిస్తున్న కానిస్టేబుల్

కౌతాళం/ఆదోని రూరల్ : కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు దోషులకు శిక్ష ఖరారైనట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి, ఏపీపీ భాస్కరావు గురువారం తెలిపారు. వల్లూరు గ్రామానికి చెందిన వడ్డె చంద్రకళను అదే గ్రామానికి చెందిన బడిగేరి చిన్న మారెప్ప, మారెన్నలు 19-1-2020 నాడు జుట్టు పట్టుకుని, చీరలాగి అవమాన పరిచి కొట్టారు. ఈ కేసులో సాక్ష్యలతో పాటు నేరం రుజువు కావడంతో ఆదోని రెండవ ఆడిషనల్ జెఎఫ్‌సీఎం కోర్టు జడ్జి వి.వి.ఎస్.వెంకటలక్ష్మి గురువారం శిక్షను ఖరారు చేశారని వారు వెల్లడించారు. ఒక్కొక్కరికి ఒకటిన్నర సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా రూ.వెయ్యి విధించినట్లు చెప్పారు.

ఉద్యోగుల ఆనందహేల

- హామీల అమలులో సీఎం జగన్ మరో ముందడుగు
- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్
- సీపీఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్‌కు సమానంగా జీపీఎస్
- హెచ్‌ఆర్‌ఏ పెంపుపై ఉద్యోగుల హర్షం



ఆదోని అర్బన్/రూరల్/సెంట్రల్ : ప్రభుత్వ ఉద్యోగులు కాంట్రాక్ట్ ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ సర్కార్ తీపి కబురునందించింది. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సీపీఎస్ బదులు జీపీఎస్‌ను అమలు చేసి, ఉద్యోగులకు అరియర్స్‌తో డీఏ వర్తింపజేస్తూ హెచ్‌ఆర్‌ఏను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2014 ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చంద్రబాబునాయుడు దొంగ హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ముఖం చాటేశారు. టీడీపీ ప్రభుత్వం న్యాయస్థానంలో కేసుల పేరిట కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేసింది. ప్రజా సంకల్పయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగుల ఆవేదనను తెలుసుకున్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని కాంట్రాక్టు ఉద్యోగుల 23 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ వారికి తీపి కబురు అందించారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని సదుపాయాలను వర్తింపజేస్తున్నారు. అలాగే పాత పెన్షన్‌కు సమానంగా ఉండేలా గ్యారెంటీ పింఛన్ స్కీంను అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం లభించింది. ఉద్యోగులకు అరియర్స్‌తో 2.73 శాతం డీఏ వర్తింపజేయనుంది. ఉద్యోగులకు 12 శాతం నుంచి 16 శాతం హెచ్‌ఆర్‌ఏ పెంచడంతో ఈ నిర్ణయాలపై కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే తమకు న్యాయం జరిగిందని కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు కొనియాడుతున్నారు.

జీపీఎస్ నిర్ణయం మంచిదే



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీపీఎస్ నిర్ణయం ఉద్యోగులకు మంచిదే. ఉద్యోగ సంఘాలతో చర్చించి కొన్ని సవరణలు చేస్తే బాగుంటుంది. పూర్తిస్థాయిలో కొన్ని సవరణలు చేసి ఉద్యోగులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలి. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సాహసోపేత నిర్ణయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారన్నారు. వైద్యవిధాన పరిషత్‌లో పనిచేసే వారికి ట్రెజరీ ద్వారా వేతనాలు ఇచ్చేలా తీసుకున్న నిర్ణయం హర్షణీయం. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, పీఆర్‌సీపై కమిటీ వేయడం చాలా మంచి నిర్ణయం.

– రమేష్‌రెడ్డి, ఆదోని నియోజకవర్గ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

సంతోషంగా ఉంది



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మంత్రివర్గ సమావేశంలో సీపీఎస్ బదులు జీపీఎస్ పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తిగా న్యాయం చేయాలంటే దీంతో పాటు ఓపీఎస్‌ను కూడా అమలు చేస్తే బాగుంటుంది. – వీరచంద్రయాదవ్, ఎస్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్

సీఎంకు రుణపడి ఉంటాం



2002లో కోసిగి జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకురాలిగా చేరాను. అప్పటి నుంచి రెగ్యులర్ అవుతామన్న ఆశతో ఉన్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని రెగ్యులర్ చేయడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వం ఏమీ చేయలేకపోయినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని రెగ్యులర్ చేయడం సంతోషంగా ఉంది. సీఎంకు రుణపడి ఉంటాం. – పి.కాంతమ్మ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఆదోని

నేడు వ్యవసాయ సలహా మండలి సమావేశం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మురళీ మోహన్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఓ రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు తదితర వ్యవసాయానికి సంబంధించిన విషయాలు చర్చిస్తామన్నారు. సమావేశానికి బోర్డు కమిటీ మెంబర్లు తప్పక హాజరు కావాలని సూచించారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల అమ్మకం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఓ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అమ్ముతున్నారని ప్రగతిశీల డెమోక్రటిక్ స్టూడెంట్ అర్గనైజేషన్ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, మల్లికార్జున, ఉదయ్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలను ఇవ్వక తమ పాఠశాల పేరు మీద ఉన్న పుస్తకాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. పాఠ్య పుస్తకాల కోసం వేలకు వేలు ఖర్చు పెట్టలేక అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నిబంధనలను మీరి అక్రమాలకు పాల్పడుతున్న పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ నాయకులు అశోక్, ప్రవీణ్, హుసేని, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'నాడు–నేడు' పనులు వారంలోపు పూర్తి చేయాలి



నాగలాపురంలో హౌసింగ్ నిర్మాణాలపై విచారిస్తున్న స్పెషల్ అధికారి సుబ్రహ్మణ్యం

ఆదోని రూరల్ : నాడు–నేడు పనులను పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, జగనన్న కాలనీల్లో నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదోని మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం మండలంలోని ఆరేకల్, నాగలాపురం గ్రామంలో ఆయన పర్యటించి మనబడి నాడు–నేడు పనులు, జగనన్న కాలనీ, హౌసింగ్ నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క మండలస్థాయి అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఈనెల 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, అందుకు సంబంధించి పాఠశాలల్లో నాడు–నేడు పనులను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మండలంలో 60 శాతం పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. గృహ నిర్మాణాల టార్గెట్ 516 ఉండగా, 443 ఇళ్లు పూర్తి కాగా, 86 శాతం టార్గెట్ పూర్తి అయ్యిందన్నారు. త్వరలో మిగిలినవి కూడా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు, హౌసింగ్ డీఈ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, ఉపాధిహామీ ఏపీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న ప్రజా సంఘాల నాయకులు

మంత్రాలయం :మంత్రాలయం మండలం రచ్చమర్రి గ్రామంలో ఏరువాక పౌర్ణమి రోజున దళితులపై జరిగిన దాడి కేసుల్లో నిందితులను వెంటనే అరెస్ట్ కోరుతూ ఏపీ ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్, జై భీం ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, ఆనంద్‌బాబు, అమ్రేష్, చిక్కంజానయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని దళితులతో సమావేశం నిర్వహించారు. అనంతరం దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని రచ్చమర్రి గ్రామం నుంచి మాధవరం పోలీస్‌స్టేషన్ వరకు పాదయాత్రగా వెళ్లారు. పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిందితులను అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. సీఐ శ్రీనివాసులతో వారితో చర్చించి త్వరలోనే పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆయనకు వినతిపత్రం అందజేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువులు, విత్తనాల నిల్వల రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి

ఆదోని రూరల్ : ఆదోని పట్టణంలోని విత్తన, ఎరువుల దుకాణాలను గురువారం సాయంత్రం మండల వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. దుకాణాల్లో సరైన పత్రాలు చూపని విత్తన నిల్వలు, అమ్మకాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు. వీటిని సేకరించి ప్రయోగశాలకు పంపుతున్నట్లు వెల్లడించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా బిల్లులు పొందాలన్నారు. ఎరువులు, విత్తన దుకాణదారులు నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో లైసెన్సులు రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక వాయిదా



విలేకరులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అశ్వద్ధామ, ఎంపీడీఓ ప్రభాకర్

పెద్దకడబూరు :మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక వాయిదా పడింది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రత్యేకాధికారి అశ్వద్ధామ మాట్లాడుతూ వైస్ ఎంపీపీ పరమేష్‌గౌడ్ అకాల మృతి చెందడంతో చేపట్టిన ఎన్నికలు గురువారం నిర్వహించాల్సి ఉంది. అయితే ఉదయం 11గంటలకు రావాల్సిన సభ్యులు మధ్యాహ్నం అయినా ఎవ్వరూ రాలేదన్నారు. దీంతో ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. శుక్రవారం రోజు అయినా ఈ ఎన్నికలకు ఎంపీటీసీ సభ్యులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్ ఉన్నారు.

పాఠశాలలకు విద్యాకానుకలు



పాఠశాలలకు విద్యాకానుకలను తరలిస్తున్న దృశ్యం

కోసిగి: 2023–2024 విద్యా సంవత్సరానికి గానూ కోసిగి మండలంలో ప్రతి పాఠశాలకు విద్యాకానుకలను పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాధికారి మొయినుద్దీన్ తెలిపారు. గురువారం కోసిగి మండలానికి వచ్చిన విద్యాకానులను ఉపాధ్యాయులు, సీఆర్‌పీలతో కలిసి పాఠశాల వారీగా సంసిద్ధం చేసి వాహనంలో పంపించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 1 నుంచి 10వ తరగతి వరకు 14,565 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఇందుకుగాను జగనన్న విద్యకానుకల కింద విద్యార్థులకు 1.27లక్షల పాఠ్య పుస్తకాలు పెండింగ్‌లో లేకుండా నాలుగు విడుతలుగా ముందుగానే వచ్చాయన్నారు. బ్యాగులు 15,485, షూస్ బాలురకు 7,895, బాలికలకు 7,573 మంది మొత్తం 15,468 జతల షూస్‌లు, సాక్స్‌లు 30,936 వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ లోగా వీటిని పాఠశాలలకు చేర్చి జూన్ 12న పిల్లలకు అందజేస్తామన్నారు. సీఆర్‌పీలు అనంతరామ్, యోహాన్, ఉసేని పాల్గొన్నారు.

గ్రామంలో ప్రశాంతతను కాపాడుకుందాం



మాట్లాడుతున్న సీఐ ఎరిషావలి

కౌతాళం: గ్రామంలో ప్రశాంతతను కాపాడుకోవడానికి అందరూ సహకారం అందించాలని కోసిగి సీఐ ఎరిషావలి అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. గ్రామంలో కొద్ది రోజుల్లోనే వ్యవసాయ భూముల రీ సర్వే నిర్వహిస్తున్నారని, అందులో రైతులు ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో గతంలో ఫ్యాక్షన్ గొడవలవల్ల ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని, అలాంటి వాటికి తావులేకుండా పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు.

ముగిసిన పది సప్లిమెంటరీ పరీక్షలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాల, మౌంట్ కార్మెల్ పాఠశాలలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజున సోషల్ స్టడీస్ పరీక్షకు బాలుర పాఠశాలలో 82 మందికి గానూ 61 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరైయ్యారు. మౌంట్ కార్మెల్ పాఠశాలలో 76 మందికి గానూ 62 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరైయ్యారైనట్లు పరీక్షల చీఫ్ శోభారాణి, లక్ష్మీనారాయణ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు రామాంజినేయ రెడ్డి, సిద్దప్పలు తెలిపారు. పరీక్షలు ఎలాంటి మాస్ కాపింగ్ జరుగకుండా ప్రశాంతంగా ముగిసినట్లు వెల్లడించారు.

ప్రహరీ నిర్మించండి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అర్అర్ లెబర్ కాలనీ, శంకర్‌నగర్ కాలనీలకు వెళ్లే రహదారికి ఇరువైపులా ప్రహరీ గోడలు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు దిలీప్‌ధోకా తెలిపారు. గురువారం పట్టణంలోని ఆదోని నుంచి ఆలూరు వెళ్లే రహదారిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంజరాపోల్ దగ్గర ఉన్న మురుగు కాలువ ప్రమాదకరంగా ఉందన్నారు. అటువైపుగా వెళ్లే వారు రాత్రిపూట రోడ్డు సరిగా కనపడక కాలువలో పడే ప్రమాదం ఉందన్నారు. రహదారికి ఇరువైపుల ప్రహరీ గోడలు నిర్మిస్తే బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ రాష్ట్రయువజన కాంగ్రెస్ నాయకులు మారుతీరావు, దేవిశెట్టి వీరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ హెచ్‌ఎంలుగా బాధ్యతల స్వీకరణ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా శోభారాణి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వెంకటేశ్వర రెడ్డి గురువారం ఆయా పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. శోభారాణి కౌతాళం మండలంలో ఎరిగేర పాఠశాలలో పనిచేస్తు బదిలీపై కోసిగి బాలికల పాఠశాలకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హెచ్‌ఎం నీలకంఠ బదిలీపై ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు పాఠశాలకు వెళ్లారు. అలాగే బాలుర పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం క్రిష్ణమూర్తి ఎమ్మిగనూరు బాలికల పాఠశాలకు బదిలీఅయ్యారు. కోసిగి బాలికల పాఠశాలలో మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర రెడ్డి పదోన్నతి పై బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. వారికి పాఠశాల తోటి ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

కౌతాళం ఎంపీడీఓగా సుబ్బరాజు



కౌతాళం: కౌతాళం ఎంపీడీఓగా సుబ్బరాజు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మండలానికి గత ఏడేళ్లుగా రెగ్యులర్ ఎంపీడీఓ లేక ఇన్‌చార్జ్‌లతోనే పాలన కొనసాగించారు. ఇటీవల ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంతో కొలిమిగుండ్ల మండలం ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బరాజుకు పదోన్నతి కల్పిస్తూ కౌతాళం రెగ్యులర్ ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఎంపీడీఓకు మండల కార్యదర్శులు, సిబ్బంది పూలమాలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదోనిలో పార్కుల అభివృద్ధి



చిన్నపిల్లల పార్కులో కుర్చీలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో పార్కులను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఇందిరానగర్, టీజీఎల్ కాలనీ, ఎల్‌ఐజీ, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎనిమిది పార్కులను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గురువారం వివిధ వార్డుల్లోని పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద ఒక్కొక్క పార్కు రూ.5 లక్షలు చొప్పున ఎనిమిది పార్కులకు రూ.40 లక్షలను కేటాయించినట్లు చెప్పారు. పార్కులలో కుర్చీల ఏర్పాటు, ఆట వస్తువులు, మొక్కల పెంపకం, వాటర్ ఫౌంటేషన్ తదితర పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అనంతరం షేర్ఖాన్ కొట్టాలలో జరుగుతున్న మురుగు కాలువల నిర్మాణాల పనులనుపరిశీలించారు. నాణ్యతగా పనులను చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులను ఆదేశించారు.

శ్రీ మఠానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ



శ్రీ మఠం క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. గురువారం శ్రీ మఠం పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి. పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో తెల్లవారు జాము నుంచి మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీ మఠం మాడ విధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి దర్గా

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను సమర్పించి, ప్రార్థనలు జరుపుకున్నారు. దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. ఈనెల 1నుంచి 4వతేది వరకు ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భక్తుల రద్దీ కారణంగా స్వామి దర్శనానికి రాని భక్తులు గురువారం అధికంగా తరలిరావడంతో దర్గా కిటకిటలాడింది. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. అనంతరం భక్తుల్ని దర్శినానికి వదిలారు.

వైషల్య ఇంటిని సందర్శించిన వైద్య బృందం



మృతి చెందిన చిన్నారి వైషల్య తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వైద్యాధికారి మనోజ్‌కుమార్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బీరప్ప సమీపంలో నివాసం ఉంటున్న వైషల్య అనే చిన్నారి అధిక విరేచనాలతో మృతి చెందిన విషయంపై గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు వైద్యాధికారులు స్పందించారు. ఆమె ఇంటికి డాక్టర్ మనోజ్‌కుమార్, వైద్య సిబ్బంది వెళ్లి చిన్నారి తల్లిదండ్రులు తలారి అయ్యప్ప, నరసమ్మ కలిసి పరిస్థితిని సమీక్షించారు. చిన్నారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఏ వస్తువు కొన్నా వాటిని శుభ్రంగా నీటితో కడుక్కొని తినాలని, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. వారి ఇంట్లోని తాగునీటి నమూనాను సేకరించి ల్యాబ్ టెస్టింగ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఎపిడమిక్ సెక్షన్ ఎంపీహెచ్ ఈఓ చలపతి రావు, కోసిగి ఎంపీహెచ్‌ఈఓ యల్లప్ప, సూపర్ వైజర్ రాజశేఖర్, సీహెచ్ఓ యువరాజు, ఏఎన్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

యోగాసనం.. దివ్య ఔషధం



సూర్యనమస్కారం చేస్తున్న విద్యార్థులు

- యోగా సాధనతో మానసిక ఒత్తిళ్లు దూరం
- జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలు
- విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఆదోని సెంట్రల్: అధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిళ్లు అధికమయ్యాయి. వాటిని అధిగమించాలి అంటే యోగాసనమే దివ్య ఔషధంగా పని చేస్తుంది. ఆదోని పట్టణంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక పిల్లలకు వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా యోగా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసింది. కళాభారతి సేవాసమితి సహకారంతో పిల్లలకు యోగా, కర్రసాము వంటి వాటిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు యోగా సాధన చేయిస్తున్నారు. ఈ శిబిరంలో 20 నుంచి 30 పిల్లలుదాకా శిక్షణ తీసుకుంటున్నారు.

అష్టాంగాసన సాధన

యోగా సాధనలో ప్రధానంగా సూర్య నమస్కారం, చంద్ర నమస్కారం, పద్మాసనం, నౌకాసనం, హనుమాన్ ఆసనం తదితర ఆసనాలను వేయిస్తున్నారు. యోగాలోని అష్టాంగాలైన యమ, నియమ, అసన, ప్రాణాయమ, ప్రత్యాహార, దారణ, ధ్యాన, సమాధిని నేర్పుతున్నారు. వీటితో పాటు ఆరోగ్య పరిరక్షణకు ధనుస్సాసనం, త్రికోణాసనం, తాడాసనం, మచ్చేందరాసనం గురించి విద్యార్థులకు వివరిస్తున్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొనాలి



యోగాపై ఇష్టంతో ఈ శిక్షణకు వస్తున్నా. మా అమ్మ శ్రీదేవి, నాన్న మల్లప్ప రైతు కుటుంబానికి చెందినవారు. వారి ప్రోత్సాహంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నా. రాష్ట్ర స్థాయిలో 3 వ స్థానం, జిల్లా స్థానంలో మొదటి స్థానంలో నిలిచాను. భవిష్యత్తులో జాతీయస్థాయి ప్రదర్శనల్లో పాల్గొనాలని ఉంది. వేసవి సెలవుల్లో ఉచితంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ ద్వారా చాల నేర్చుకున్నాను. నాకు ఎంతగానో ఉపయోగపడింది. – హరిప్రియ ఆదోని

యోగా మానసిక ఉల్లాసం కల్పిస్తుంది:



ఉదయమే యోగా చేయడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుంది. యోగాతో పాటు పిల్లలకు మానసిక ధైర్యం నింపుతున్నాం. విద్యార్థులకు యోగా, కారాటే, బాక్సింగ్, కర్రసాము శిక్షణ తీసుకున్న వారిలో ప్రతిభను గుర్తించి వివిధ పోటీల్లో పాల్గొనేలా చేస్తాము. విద్యార్థులు ఎదిగే వయస్సు కాబట్టి వారికి అవసరమైన వ్యాయమంతో పాటు ఫిట్‌నెస్, మానసిక స్థిరత్వం ఏర్పడుతుంది. – కేశవ్ మాస్టర్